## ల్యూసర్న్ పశుగ్రాసములో గల పోషక విలువలు

మాంసకృత్తులు 20-24%, జీర్ణమయ్యే మొత్తము పోషకాలు 50%, కాల్షియం 0.56%, భాస్వరము 0.14%, పొటాషియం 0.69%

## ఎంత పశుగ్రాసము మేపాలి

ల్యూసర్న్‌ను నెమ్మదిగా అలవాటు చెయ్యాలి. 3-4 రోజులు అలవాటు పడిన తర్వాత ఒక్కొక్క పశువుకు రోజుకు 10 కేజీలు (ఉదయం 5 కేజీలు, సాయంత్రం 5 కేజీలు) మేప వచ్చును. అధికముగా మేపితే పిల్లిపెసర వలెనే కడుపు ఉబ్బుతుంది. కడుపు ఉబ్బు (Bloat) నివారణకు ల్యూసర్న్ మేపడానికి ముందుగా 5 కేజీల ఎండుగడ్డిని మేపితే కడుపు ఉబ్బు రాదు. కడుపు ఉబ్బు తగ్గడానికి అర లీటరు. మంచినూనె (పామాయిల్, వేరుశనగనూనె)ను నాలుక పట్టుకోకుండా డ్రింకు సీసా సహాయముతో పశువుకు త్రాగించాలి.

**బంగారు తీగ:** ల్యూసర్న్ పశుగ్రాసాన్ని ఆశించే ఒకే ముఖ్యమైన పరాన్న కలుపుమొక్క బంగారుతీగ (కస్కుట లేదా దాదర్). ల్యూసర్న్ విత్తనాలు పసుపు రంగులో ఉంటాయి. కస్కుట విత్తనాలు నలుపు రంగులో ఉంటాయి. కాబట్టి పొలంలో విత్తే ముందే వేరు చెయ్యాలి. 5% ఉప్పు ద్రావణంలో ల్యూసర్న్ విత్తనాలు వేస్తే బంగారు తీగ విత్తనాలు నీటిపై తేలతాయి. కాబట్టి సులువుగా వేరు చెయ్యవచ్చును. ఎక్కడైన కన్పిస్తే సేకరించి కాల్చివేయాలి.


**డా॥ బి. జాన్ బాబు,** SMS, Animal Science

**డా॥ పి.వి.వి.ఎస్. శివరావు,** SMS, Animal Science

**డా॥ వి.ఎస్.జి.ఆర్. నాయుడు,** హెడ్, కె.వి.కె. కలవచర్ల

**డా॥ డి. దామోదరరెడ్డి,** డైరెక్టర్, ఐ.సి.ఏ.ఆర్-సి.టి.ఆర్.ఐ, రాజమండ్రి

**కృషి విజ్ఞాన కేంద్రము**

కలవచర్ల, రాజానగరం మండలం, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్


కరపత్రము



# ల్యూసర్న్ పశుగ్రాసము

# సాగు మెళకువలు




**కృషి విజ్ఞాన కేంద్రము**

కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ

(భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి)

కలవచర్ల - 533 297, రాజానగరం మండలం

తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్

మార్చి 2019

# ల్యూసర్న్ పశుగ్రాసము - సాగు మెళకువలు

పాడి పశువు యొక్క ఆరోగ్యం, పాల దిగుబడి మనం ఇచ్చే పశుగ్రాసముపై ఆధారపడి ఉంటుంది. మంచి పోషకాలు ఉన్న పశుగ్రాసాన్ని చాలినంత మేపితే దాణా ఖర్చు తగ్గుతుంది. రైతులు ఎక్కువగా జొన్న, నేపియర్ వంటి పశుగ్రాసాలను సాగు చేస్తున్నారు. దీని వలన ఆశించిన స్థాయిలో పాల దిగుబడి సాధించలేక పోతున్నారు.

పశుగ్రాసాలలో కూడా చిక్కుడు (పప్పు) జాతి పశుగ్రాసాలున్నాయి. వీటిలో అధిక పాల దిగుబడికి కావలసిన మాంసకృత్తులు, పోషకాలు, ఖనిజ లవణాలు, విటమినులు పుష్కలంగా ఉంటాయి. వెనుకటి రోజుల్లో రైతులందరూ పిల్లి పెసర, జనుము వంటి చిక్కుడు జాతి పశుగ్రాసాలను వరి పంట తర్వాత సాగు చేస్తుండేవారు. అయితే ఇటీవల కాలములో బహు తక్కువ మంది మాత్రమే జనుము, పిల్లి పెసర వంటి పశుగ్రాసాలను సాగు చేస్తున్నారు. అందుచేతనే చాలా డైరీ ఫారములు ప్రారంభించిన 1-2 సంవత్సరములలో మూసి వేస్తున్నారు.



చిక్కుడు జాతి పశుగ్రాసాలలో బర్సీము, ల్యూసర్న్ ముఖ్యమైనవి. అయితే బర్సీము మన ప్రాంతమునకు అనుకూలము కాదు. ల్యూసర్న్ ఒక అద్భుతమైన పశుగ్రాసము మన ప్రాంతములో కూడా సాగు చేయబడుచున్నది. శీతాకాలములో వెదజల్లుకొంటే జూన్-జూలై నెలల వరకూ మృదువైన, రుచికరమైన, ఆరోగ్యకరమైన అధిక పాల దిగుబడినిచ్చే పశుగ్రాసాన్ని పొందవచ్చు. దాణాకు అయ్యే ఖర్చు తగ్గుతుంది. వరి మాగాణులలో (సార్వా పంట కోసిన) సాగు చేయవచ్చును. ఇప్పటికే జిల్లాలో చాలామంది రైతులు ల్యూసర్న్‌ను సాగు చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

మన జిల్లాలో నల్ల రేగడి నేలలో శీతాకాలములో సాగు చేయుటకు అనుకూలము. అక్టోబరు, నవంబరు నెలలో విత్తుకోవచ్చును. నీటి సదుపాయము ఉండి నీరు నిలబడని నేలలు అనుకూలము. ల్యూసర్న్‌లో ఏక వార్షిక మరియు బహువార్షిక రకాలు ఉన్నాయి. ఇది 0.6 మీటర్ల నుండి 1.6 మీటర్ల వరకూ ఎదుగుతుంది.

**రకాలు:** సిర్సా - 9, Co - 1, ఆనంద్ - 2

**సాగు విధానము:** ముందుగా భూమిని మెత్తగా దుక్కి చెయ్యాలి. ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువు వెయ్యాలి. విత్తనానికి రైజోబియం కల్చరును పట్టిస్తే మంచిది.

**విత్తనము:** ఎకరానికి 6 నుండి 8 కేజీల విత్తనము అవసరమవుతుంది. విత్తనాన్ని వెదజల్లిన తర్వాత కంపలాగాలి.

**తడులు:** విత్తిన తర్వాత అవసరాన్ని బట్టి తడి ఇవ్వాలి. తర్వాత ప్రతీ 10-15 రోజుల వ్యవధిలో తడులు పెట్టాలి. విత్తిన 15 రోజుల వ్యవధిలో కలుపు తియ్యాలి.

**ఎరువులు:** నత్రజని, భాస్వరము మరియు పొటాష్ ఎరువులను 22 కేజీల యూరియా 200 కేజీల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 25 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో చివరి దుక్కిలో వేసుకోవాలి.

**దిగుబడి:** ఎకరానికి 24-32 టన్నుల శ్రేష్ఠమైన పశుగ్రాసము లభిస్తుంది. మొదటి కోత 45 రోజుల నుండి 60 రోజులకు వస్తుంది. తర్వాత ప్రతి 30 రోజులకూ ఒక కోత కోసుకోవచ్చును. రైతులు 20 రోజులకు కూడా ఒక కోత కోసు కొంటున్నారు. భూమికి 7-8 సెం.మీ. ఎత్తులో కోసుకుంటే మరల చిగురిస్తుంది. ఈ పశుగ్రాసాన్ని మేసిన పశువులు రోజుకు 1 లీటరు పాలు అదనముగా ఉత్పత్తి చేస్తాయి.

ల్యూసర్న్ పశుగ్రాసాన్ని ఎండబెట్టి హే(Hay)గా తయారు చేసుకొనవచ్చును. అంటే మనము జనుమును ఎండబెట్టి ఏవిధముగా కట్టలుగా కట్టి వరిగడ్డితో కలిపి సంవత్సరము పొడవునా మేపుతారో అదే విధముగా 'హేను మేపుకోవచ్చును'. ఎకరం నుండి 5 టన్నుల ఎండు ల్యూసర్న్ గడ్డి లభిస్తుంది.